క్లుప్తంగా

చిత్రలేఖనంలో ఉపాధ్యాయుడి ప్రతిభ


ప్రశంసాపత్రం అందుకుంటున్న అప్పలరాజు

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బల్లెడ అప్పలరాజు జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ద్వితీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి సోమవారం తెలిపారు. శ్రీకాకుళం శిశు వైద్య బృందం, పోలీస్ శాఖ నిర్వహించిన మహా సంకల్పం అనే కార్యక్రమంలో భాగంగా ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో మహిళలపై జరుగుతున్న దాడులను ఖండించే అంశంపై అప్పలరాజు చిత్రలేఖనం ప్రదర్శించారు. బహుమతిగా రూ.3 వేల చెక్కు, ప్రశంసాపత్రం జిల్లా వైద్య బృందం సభ్యులు అందజేశారు. బహుమతిగా వచ్చిన రూ.3 వేలను అదే సంస్థకు విరాళంగా అందజేశారు. ఉపాధ్యాయుడు అప్పలరాజుని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బందిని అభినందించారు.

హిందూ సంప్రదాయాన్ని కాపాడాలి


అవలింగిలో ర్యాలీ నిర్వహిస్తున్న పాఠశాల సిబ్బంది, విద్యార్థులు

సారవకోట: హిందూ సంప్రదాయాన్ని కాపాడాలని, ఆంగ్ల సంవత్సరం వేడుకలకు దూరంగా ఉండాలని కోరుతూ అవలింగి జేబీటీ పాఠశాల విద్యార్థులు అవలింగి, బుడితి, చీడిపూడి గ్రామాల్లో సోమవారం ర్యాలీ నిర్వహించారు. హిందూ సంప్రదాయాలు, సంస్కృతిని పక్కన బెట్టి ఆంగ్ల సంస్కృతిని పాటించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మోహనగాంధీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వితరణ


అగ్నిబాధితులకు వితరణ అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పొందూరు: మండలంలోని కోటిపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన అగ్నిబాధితులకు పొందూరు లయన్స్ క్లబ్ సంస్థ చేయూతనందించింది. నాలుగు కుటుంబాలకు రూ.10 వేల నగదు, 20 కేజీల బియ్యం చొప్పున అందజేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ మల్లిబాబు, కల్యాణి, ధర్మారావు, బాడాన గిరి, శ్రీనివాసరావు, ఆదినారాయణ, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ



నిర్వాహకుల నుంచి బహుమతి అందుకుంటున్న శ్రీరామ్

నరసన్నపేట: జిల్లా స్థాయిలో వేదం ఇంటర్నేషనల్ ఆర్టిఫియల్ ఇంటలిజెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సివిల్ సర్వీస్‌పై హైస్కూల్ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో నరసన్నపేటకు చెందిన 8వ తరగతి విద్యార్థి మావుదూరి శ్రీరామ్ ప్రథమ బహుమతి పొందాడు. పాతపట్నంలో సివిల్ సర్వీసెస్ ఫౌండేషన్ ప్రతినిధులు పోటీ పరీక్షలను ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహించారు. దీంట్లో 250 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థి భవన్ స్కూల్‌కు చెందిన శ్రీరామ్ ప్రథమ స్థానంలో నిలవడం ఆనందంగా ఉందని స్కూల్ డైరెక్టర్ ఆరంగి గోవింద్ బాబు అన్నారు. స్కూల్ తరఫున సోమవారం అభినందించారు.

రహదారి పనులు ప్రారంభం


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ మురళి

నరసన్నపేట: మండలంలోని సత్యవరం గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని ఎంపీపీ ఆరంగి మురళి అన్నారు. పంచాయతీ గ్రాంట్ రూ.4 లక్షలు, మండల పరిషత్ గ్రాంట్ రూ. 6 లక్షలతో మూడు చోట్ల సీసీ రోడ్లు వేస్తున్నట్లు చెప్పారు. సోమవారం ఈ పనులను సుసరాం వీధిలో ప్రారంభించారు. వార్డు సభ్యులు సూర లక్ష్మీనారాయణ, ఆరంగి కోటిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల రైతు కుదేలు


వీఆర్ గూడెంలో పాడైన టమాటా పంట

- పతనమైన టమాటా ధర
- దెబ్బతిన్న ఉల్లి, దొండ
- ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్న రైతులు

పొందూరు: ఈ ఏడాది ఖరీఫ్ రైతులుకు కలిసిరాలేదు. దీనికితోడు ప్రభుత్వం నుంచి ఎటువంటి పెట్టుబడి సాయం (అన్నదాత సుఖీభవ) అందలేదు. అన్నదాత అప్పులు చేసి సాగుచేసిన వరి పంటతోపాటు కూరగాయల సాగు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నది. ఆమదాలవలస నియోజకర్గంలో సుమారు 655 ఎకరాల్లో టమాటా, ఉల్లి, దొండ, బెండ, క్యాబేజీ, మిరప తదితర పంటలు సాగు చేస్తున్నారు. టమాటా, ఉల్లి, దొండ పంటలు పూర్తిగా పాడయ్యాయి. పొందూరు మండలంలోని వీఆర్ గూడెం, బాణాం, దళ్లవలస, పిల్లలవలస, ధర్మపురం, బురిడికంచారం, లోలుగు, కృష్ణాపురం, తండ్యాం, గూనానపేట తదితర గ్రామాల్లో కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. ఆమదాలవలస మండలంలో వంజంగి, నిమ్మతొర్లవాడ, టి-మన్నయ్యపేట, కె-మన్నయ్యపేట, వంజంగిపేట గ్రామాల్లో, సరుబుజ్జిలి మండలంలో కొండలవలస, రొట్టవలస, యరగాం, వెన్నెలవలసలో, బూర్జ మండలంలో అల్లెన, పాలవలస, బూర్జ, వావాము గ్రామాల్లో సాగు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఉల్లి, టమాటా, దొండ పంటలు నాశనమయ్యాయి.


ఉల్లి కాడలు తీస్తున్న రైతులు


మాడిపోయిన దొండ పంట

తగ్గిన టమాటా ధర...

పొందూరు మండంలో టమాటా పంట నాశనమైంది. మంచి దిగుబడి వచ్చే సమయానికి వర్షం కురవడంతో నల్లని మచ్చలు వచ్చాయి. వీటిని కోసినా రెండు రోజులకు మించి నిల్వ ఉండని పరిస్థితి వచ్చింది. ఒక్కసారిగా ధర తగ్గిపోయింది. కార్తీక మాసంలో ఒక ట్రే (సుమారు 28 కేజీలు) రూ.1200 నుంచి రూ.1,000 ధర పలికింది. ప్రస్తుతం ఒక ట్రే ధర రూ.300లకు పడిపోయింది. రైతులు లబోదిబో మంటున్నారు.

కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి..

ఉల్లి పంట పొలంలో కుళ్లిపోతుంది. ఉల్లి సైజు పెరిగే సమయంలో వర్షం పడటంతో దెబ్బతింది. నీరు నిలిచిపోవడంతో పాడైపోయింది. రైతులు ఉల్లి కాడలు తీసేసి అమ్ముకొనే పరిస్థితి ఉంది. ఒక్కసారిగా మార్కెట్లోకి ఉల్లి కాడలు రావడంతో కట్ట రూ.10లకు మించి ధర పలకటం లేదు. దొండ సాగు పూర్తిగా మాడిపోయింది. మార్కెట్‌లో అక్కడక్కడ మాత్రమే కనిపిస్తుంది. ప్రభుత్వం ఆదుకోవాలని కూరగాయలు సాగు రైతులు కోరుతున్నారు.

ఆమదావలస నియోజకర్గంలో కూరగాయల సాగు (ఎకరాల్లో) వివరాలు ఇలా..

కూరగాయలసాగు	పొందూరు	ఆమదాలవలస	బూర్జ	సరుబుజ్జిలి
టమాటా	150	20	5	10
ఉల్లి	20	10	10	10
దొండ	50	30	10	5
ఇతర పంటలు	230	60	20	15

ఉల్లి పంట పాడైంది



ఉల్లి పంట మరో 20 రోజుల్లో చేతికి రావాల్సి ఉంది. ఇటీల వారం రోజులపాటు కురిసిన వర్షాలకు ఉల్లిపాయలు భూమిలో కుళ్లిపోతున్నాయి. ఉల్లి కాడలను తీసి అమ్ముకుంటున్నాం. ఎకరాకు సుమారు రూ.60 వేల పెట్టుబడి అయింది. కనీసం రెండు, మూడు వేలు రూపాలయలు కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– పేడాడ గోపాలం, ఉల్లి రైతు, వీఆర్ గూడెం, పొందూరు మండలం

అప్పులే మిగిలాయి..



టమాటా, దొండ, ఉల్లి పంటలు పూర్తిగా నాశనమయ్యాయి. రెండెకరాల టమాటా, రెండెకరాల దొండ, ఎకరా ఉల్లి, మిరప 50 సెంట్లలో సాగు చేస్తున్నాను. సుమారు రెండు లక్షల పెట్టుబడి పెట్టాను. పూర్తిగా పంటలు పోయాయి. ఏం చేయాలో దిక్కుతోచటం లేదు.

– సువ్వారి పెంటయ్య, రైతు, వీఆర్ గూడెం, పొందూరు మండలం

క్యాలెండర్ల ఆవిష్కరణ


సారవకోట: క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, అధికారులు


పొందూరు: క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న

పొందూరు: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్)-2025 క్యాలెండర్‌ను మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న, హెచ్‌ఎం బల్ల కంటయ్యలు సోమవారం ఆవిష్కరించారు. డీటీఎఫ్ సభ్యులు గండెం రామారావు, చౌదరి వేణుగోపాలరావు, పెద్దిన రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్ల సంఘం ఆధ్వర్యంలో..

సారవకోట: మండల పరిషత్ కార్యాలయంలో సర్వేయర్ల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, అధికారులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ మోహన్‌కుమార్, సర్వేయర్ల సంఘం మండల అధ్యక్షుడు రావాడ పాపారావు, సంఘం జిల్లా కార్యదర్శి ఎల్. లోకేష్, తదితరులు పాల్గొన్నారు.


కొత్తూరు: ఏపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో..

కొత్తూరు: మండలంలోని కేజీబీవీలో ఏపీటీఎఫ్ 2025 క్యాలెండర్‌ను ఎంఈఓలు గోవిందరావు, శ్రీనివాసరావు సోమవారం ఆవిష్కరించారు. రాష్ట్ర కౌన్సిలర్ కె.శాంతారావు, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గణపతిరావు, బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, సహకార్యదర్శి డీఆర్‌కే ఆచారి, జిల్లా కౌన్సిలర్ సత్యనారాయణ, ప్రతినిధులు గోవర్ధనరావు, మురళీకృష్ణ, సురేష్, అశోక్, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ..


చిరంజీవినాగ్‌ను పరామర్శిస్తున్న పిరియా విజయ, తదితరులు


చిరంజీవినాగ్‌ను పరామర్శిస్తున్న దుంపల లక్ష్మణరావు, అంధవరపు సూరిబాబు

ఆమదాలవలస: వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తనయుడు చిరంజీవినాగ్ ఇటీవల అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లో చికిత్స పొందారు. చిరంజీవినాగ్‌ను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, పార్టీ కాళింగ కుల విభాగ రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, కళింగ వైశ్య కుల అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ మెంబర్ పేడాడ రమణకుమారి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, డాక్టర్ కిల్లి రామ్మోహన్‌రావు, తదితరులు సోమవారం పరామర్శించారు. స్పీకర్‌తో పలు అంశాలపై చర్చించారు.

న్యాయవాదుల నిరసన


ఆమదాలవలస: అనంతపురం పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది బి.వి.శేషాద్రిని హింసకు గురిచేసి ఆయన మృతికి కారణమైన పోలీసులపై చట్టపరమైన చర్యలు వెంటనే చేపట్టాలని ఆమదాలవలస బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మీబాయి డిమాండ్ చేశారు. పోలీసుల తీరుకు నిరసనగా స్థానిక సివిల్ జడ్జి కోర్టులో సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. న్యాయవాదులు ధనంజయరావు, అన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు బిజీ..బిజీ



ఈ చిత్రం సారవకోట మండలంలోని లక్ష్మీపురం సమీపంలో వరి ఆకు కట్టులు వేస్తున్న మహిళా రైతు. రబీలో వరి నాట్లు వేసే పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. సారవకోట, కొత్తూరు, అగదల, బద్రి, లక్ష్మీపురం, గోపాలపురం గ్రామాల్లో రబీ సీజన్‌లో వరిసాగు చేస్తున్నారు. మండలంలోని పాప్పంగి సమీపంలో ఉన్న రంగసాగరంలో నీరు పుష్కలంగా ఉండటంతో రైతులు వరి సాగు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. **- సారవకోట**

రక్షణ కరువు



సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస నుంచి పురుషోత్తపురం వరకు గల ఆర్‌అండ్‌బీ రహదారిలో యరగాం- పురుషోత్తపురం ఓపెన్ హెడ్ చానల్ బ్రిడ్జీ ప్రమాదస్థితిని తలపిస్తుంది. ఈ రహదారిలో భారీ ఇసుక వాహనాలు ప్రయాణాలు చేస్తుంటాయి. ఏ క్షణాన ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. **- సరుబుజ్జిలి**

అధ్వానం..



సరుబుజ్జిలి మండలంలోని అలికాం-బత్తిలి రహదారి నుంచి నక్కలపేట వరకు గల సుమారు 700 మీటర్ల సీసీ రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. రహదారి మొత్తం బీటలు వారడం వలన రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చెరువు పక్క నుంచి రహదారి ఉండడం వలన బెర్ములు పూర్తిగా కరిగి తిరిగి చెరువులో పడిపోయాయి. రహదారి ప్రమాదస్థితిని తలపిస్తుంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. **- సరుబుజ్జిలి**

ప్లేట్లు, గ్లాసుల పంపిణీ



ఎల్.ఎన్.పేట మండలంలోని లక్ష్మీనర్సుపేటలో గల ప్రభుత్వ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు భోజన ప్లేట్లు, గ్లాసులను సోమవారం పంపిణీ చేశారు. కాలేజీలో జరిగిన ఓ కార్యక్రమంలో 110 మంది విద్యార్థులకు అవసరమయ్యే ప్లేట్లు, గ్లాసులను లక్ష్మీనర్సుపేటకు చెందిన శ్రీబంగారు సంతోషి సంస్థల సభ్యుడు వైశ్యరాజు చంద్రశేఖరరాజు (పొట్టిరాజు) అందజేశారు. ఎంఈఓ చంద్రమౌళి, ప్రిన్సిపాల్ రామారావు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎం.కె.మిశ్రో, అధ్యాపకులు పాల్గొన్నారు. **- ఎల్.ఎన్.పేట**

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

సౌత్ ఇండియా సైన్స్ ఫెస్టివల్‌లో భాగంగా సోమవారం ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లోని అన్ని మండల కేంద్రాల్లో గల జెడ్పీహెచ్‌ఎస్‌లలో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. పలు ప్రాజెక్టులు జిల్లా స్థాయికి ఎంపికయ్యాయి. సైన్స్ ప్రదర్శనలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని వక్తలు అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **- సాక్షి నెట్‌వర్క్**


పొందూరు: సైన్స్ ఎగ్జిబిషన్‌లను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 రాజారావు


సారవకోట: వైజ్ఞానిక ప్రదర్శనలను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు


నరసన్నపేట: ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఈఓలు శాంతారావు, దాలినాయుడు, న్యాయనిర్ణేతలు


హిరమండలం: సైన్స్ ఫెయిర్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓలు రాంబాబు, గొల్లవాడు, ఉపాధ్యాయులు


పాతపట్నం: వైజ్ఞానిక ప్రదర్శన తిలకిస్తున్న ఎంఈఓలు గోవిందరావు, తిరుమలరావు


కొత్తూరు: సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న వసప కేజీబీవీ విద్యార్థులు


జలుమూరు: సైన్స్ ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎంపీపీ గోపి, ఎంఈఓలు మాధవరావు, ప్రసాదరావు



బూర్జ: సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులు

సంక్షిప్తంగా..

25 సారా ప్యాకెట్లతో వ్యక్తి అరెస్ట్

కొత్తూరు: మండలంలోని మాతల కాలనీ కూడలి వద్ద స్థానిక ఎస్‌ఐ ఎండీ అమీర్ అలీ తన సిబ్బందితో కలిసి సోమవారం తనిఖీలు నిర్వహించారు. మండలంలోని పెనుగోటివాడకు చెందిన కుర్మాన్ రాజప్పుడు 25 సారా ప్యాకెట్లను ఒడిశా రాష్ట్రం హడ్డుబంగి నుంచి అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. సారా ప్యాకెట్లు స్వాధీనం చేశామన్నారు. రాజప్పుడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

కొత్తూరు: మండల కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయం సమీపంలో జూదం అడుతున్న ఐదుగురుని పట్టుకొని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ఎండీ అమీర్ అలీ సోమవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,280, ఐదు బైక్‌లు, ఐదు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

బ్యాంక్ లావాదేవీలపై అవగాహన

నరసన్నపేట: బ్యాంక్ లావాదేవీలు, సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన ఉండాలని నరసన్నపేట ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ డి.మధుసూదనరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం బ్యాంకు లావాదేవీలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిగత సమాచారం కోసం బ్యాంకుల నుంచి ఓటీపీ, పిన్ నంబర్ల కోసం ఎటువంటి ఫోన్లు రావన్నారు.

పుట్టినరోజు తెచ్చిన తంట

కొత్తూరు: మండలంలోని పారాపురానికి చెందిన పైల శ్రీనివాసరావు ఆదివారం రాత్రి గ్రామంలో తన స్నేహితులతో కలిసి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకున్నాడు. ఈ వేడుకల్లో అదే గ్రామానికి చెందిన జంప జీవన్ ఫోమ్ స్ప్రే చేశాడు. స్ప్రే తనకు కొట్టవద్దని జీవన్‌కు అదే గ్రామానికి చెందిన దుక్క సాయికుమార్ చెప్పాడు. అయినప్పటికీ జీవన్ స్ప్రే చేయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి సద్దుమనిగింది. సోమవారం ఇద్దరూ మరోసారి కొట్లాడుకున్నారు. సాయికుమార్‌పై జీవన్ తాళంతో దాడిచేసి వీపుపై గాయపరిచాడు. సాయికుమార్‌కు స్థానిక సీహెచ్‌సీలో వైద్యం అందించారు. సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీవన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎండీ అమీర్ అలీ తెలిపారు.

కష్ట జీవులకు అండగా సీపీఐ

హిరమండలం: కార్మికులు, రైతులు, కష్టజీవులకు అండగా సీపీఐ పార్టీ వందేళ్లుగా నిరంతరం పోరాటాలు చేస్తోందని జిల్లా నాయకుడు బలగ శ్రీరామ్మూర్తి అన్నారు. సీపీఐ శత జయంతి వేడుకలను మండలంలోని సుభలయ గ్రామంలో సోమవారం నిర్వహించారు. దేశ రాజకీయాల్లో, జాతీయ ఉద్యమంలో సీపీఐ ప్రస్థానం చరిత్రాత్మకమన్నారు. అనపాన షణ్ముఖరావు, పార్టీ నాయకులు బడే కర్రన్న, డి.వెంకటరావు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

సారవకోట: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు సూచించారు. సోమవారం మండలంలోని జమచక్రం గ్రామంలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలు, మహిళల అక్రమ రవాణా, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు.

నిబంధనలు పాటించాలి

హిరమండలం/కొత్తూరు: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా హిరమండలం, కొత్తూరు మండలాల్లో మంగళవారం రాత్రి ప్రత్యేక ఆంక్షలు అమలు చేస్తామని ఎస్‌ఐలు ఎండీ యాసిన్, ఎండీ అమీర్ అలీ తెలిపారు. సోమవారం విలేకర్లతో మాట్లాడారు. కొత్త సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. రాత్రి 12 గంటల తరువాత రోడ్లపై తిరగవద్దన్నారు. మద్యం సేవించి, లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లోపాలను సవరించాలి

పాతపట్నం: ఎస్సీ వర్గీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జాబితాలోని వివరాలు పాతపట్నం మండలంలోని ప్రతి గ్రామంలోనూ తప్పుడుతడకలుగా ఉన్నాయని మాల మహానాడు సంఘం మండల అధ్యక్షుడు తొగిరి లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం తహసీల్దార్ కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో జనరల్ సెక్రటరీ నవగాన రత్నకుమార్, శిర్ల ప్రభాకరరావు, యజ్జల భాస్కరరావు పాల్గొన్నారు.

పారిశ్రామిక శిక్షణలు అవసరం

నరసన్నపేట: కళాశాల స్థాయి నుంచే విద్యార్థులు పారిశ్రామక శిక్షణలపై అవగాహన పెంచుకోవాలని, ఆ రంగం వైపు దృష్టి మళ్లించాలని నరసన్నపేట ఎంపీడీఓ బి.మధుసూదనరావు అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అండ్ స్మాల్ బిజినెస్ డవలప్‌మెంట్ (నీస్బెడ్) ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహించిన శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. ఎంపీడీఓ మాట్లాడుతూ విద్యార్థులను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలన్నారు. ఐసీడీఎస్ పీఓ నాగమణి, ఏఓ సునీత వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కళాశాల డైరెక్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు తగవు


మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆమదాలవలస నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని, వైఎస్సార్‌సీపీ నాయకులపై వేధింపులు, కక్ష సాధింపులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. జిల్లా పరిషత్ వద్ద ప్రజా ఫిర్యాదుల నమోదు కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. పొందూరు మండలంలోని పలు గ్రామాల్లో అర్హులకు పింఛన్లు తొలగించి కక్ష సాధింపు చర్యలకు కూటమి నాయకులు పాల్పడడం సరికాదన్నారు. ఇటువంటి చర్యలు చేపడితే భవిష్యత్‌లో ప్రజల తరఫున ఉద్యమిస్తామన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు, పొందూరు మండల నాయకులు ఉన్నారు.